

కూటమి పాలనకు ఏడాది..

టీడీపీ శ్రేణుల విజయోత్సవ సంబరాలు



ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచిలో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యప్రభ



కాకినాడలో విద్యార్థినులతో కేక్ కట్ చేయిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు



కిర్లంపూడిలో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

కూటమి పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా జిల్లావ్యాప్తంగా టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. కాకినాడలో ఎమ్మెల్యే కొండబాబు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి కేక్ కట్ చేశారు. పెద్దాపురంలో ఎమ్మెల్యే చినరాజప్ప, తాళ్లరేవులో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు కేక్ కట్ చేశారు. ప్రత్తిపాడులో ఎమ్మెల్యే సత్యప్రభ, జగ్గంపేటలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ర్యాలీ నిర్వహించారు.



పెద్దాపురంలో తన క్యాంపు కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప



తాళ్లరేవు టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

అమ్మకు.. ఆనందమే!



రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ పాఠశాలలో తొలిరోజు ఆనందం

(రాజమహేంద్రవరం/అమలాపురం-ఆంధ్రజ్యోతి)

చంద్రబాబు సూపర్‌సిక్స్ హామీల అమలుకు పట్టుదలతో ఉన్నారు.. ఒక్కో హామీని నెరవేర్చుకుంటూ వస్తున్నారు. తాజాగా గురువారం తల్లికి వందనం హామీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం బ్యాంకులకు నగదు జమచేసింది. దీంతో శుక్రవారం సాయంత్రానికి తల్లికి వందనం అమలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రతి ఒక్కరి ఫోన్ తల్లికి వందనం మెసేజ్‌లతో ట్రింగ్‌ట్రింగ్ అంటూ మోగుతుందని నాయకులు చెబుతున్నారు. ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినప్పటికీ ఈ ప్రక్రియ ఈ నెల 12 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు కొనసాగేలా మార్గదర్శకాలు విడుదల చేశారు. తొలి విడతగా రెండో తరగతి నుంచి పదో తరగతి, ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు తల్లికి వందనం వర్తింపచేయనున్నారు. అయితే ఒకటో తరగతి, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు మాత్రం వారి అడ్మిషన్లు పూర్తయ్యాక జమ చేస్తారు.

తల్లిదండ్రుల ఎదురుచూపులు..

తల్లికి వందనం డబ్బులు గురువారం ఖాతాల్లో జమవుతాయని కాకినాడ, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాతోపాటు తూర్పుగోదావరి, ఏజెన్సీల్లోని లబ్ధిదారులు ఎదురుచూశారు. ఎన్నికల్లో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన మేరకు ప్రతి విద్యార్థికి రూ.15 వేలు చొప్పున ఎందరున్నా ఇస్తారని అనుకున్నారు. గురువారం రాత్రి వరకూ ఫోన్‌కు మెసేజ్ వస్తుందని చాలామంది చూస్తూనే ఉన్నారు. మరికొందరు సాంకేతిక ఇబ్బంది అయి ఉంటుందని సచివాలయాలకు వెళ్లారు. వాళ్ల సొమ్ములు పడతాయని చెప్పడం తప్ప కానీ సమాచారం లేదు. ఈనెల 12తో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. ఆ వేడుకల్లో తల్లికి వందనం లబ్ధిదారులను భాగస్వాములను చేద్దామని ప్రభుత్వం భావించింది. కానీ అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కూలిపోవడంతో 242 మంది మృత్యువాత పడ్డారు. ప్రాణాల కంటే వేడుకలు ముఖ్యం కాదని భావించిన ప్రభుత్వం వేడుకలను వాయిదా వేసింది. దీంతో తల్లికి వందనం సొమ్ము పడడం కాస్త ఆలస్యమవుతోందని సమాచారం.

జిల్లాల వారీగా ఇదీ లెక్క..

జిల్లా	విద్యార్థులు	తల్లులు	నిధులు(కోట్లలో)
తూర్పు	188726	123779	283
కోనసీమ	170869	112419	256
కాకినాడ	228781	149403	343

అనుకోని ఘటనతో..

లబ్ధిదారుల వివరాలు సచివాలయాల సంక్షేమ అసిస్టెంట్ల లాగిన్‌కి చేరుకున్నాయి. ఆ మేరకు శుక్రవారం నుంచి అమలు మొదలు అవుతోందని చెబుతున్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తూర్పుగోదావరి కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. తల్లికి వందనం డబ్బులు ఆయా తల్లుల ఖాతాల్లో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో జమ చేయనున్నారు. జిల్లాలోని లబ్ధిదారుల ఎంపిక ఇప్పటికే పూర్తి చేశారు. అయితే అనుకోని విపత్తు సంభవించడంతో రెండు రోజుల ఆలస్యం జరిగినా తల్లికి వందనం కచ్చితంగా అందజేయనున్నారు. తల్లికి వందనం ద్వారా అందించాల్సిన డబ్బులను ఇప్పటికే ప్రభుత్వం కేటాయించి ఆయా జిల్లాలకు విడుదల చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ఆదేశాలను జీవో రూపంలో గురువారమే జారీ చేశారు. గురువారం జమ కాకపోవడంతో చాలా మంది అసంతృప్తికి గురయ్యారని తెలుస్తోంది. సచివాలయ ఉద్యోగులకు ఫోన్లు చేయడం, సెల్‌ఫోన్లలో మెసేజ్‌లు పరిశీలించుకోవడం, సచివాలయాలకు వెళ్లడం చేశారు. జిల్లా యంత్రాంగం ముందుగానే ప్రకటన చేసి ఉంటే బాగుండేదని పలువురు వ్యాఖ్యానించారు.

నేటి నుంచి తల్లికి వందనం అమలు

» నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
» ఇక తల్లుల ఖాతాలకు జమ
» విద్యార్థులు 5.88 లక్షలు
» ఉమ్మడి జిల్లాకు రూ.882 కోట్లు
» జూలై 5 వరకు అమలు
» అనుకోని ప్రమాదంతో ఆలస్యం
» కూటమి పండుగ వాయిదా
» ఆందోళన వద్దు : జిల్లా కలెక్టర్



కాకినాడ శాలిపేటలోని పాఠశాలకు వెళుతున్న బాలికలు

ఇవీ నిబంధనలు..

- పాఠశాలలు, విద్యాశాఖ ఇంటర్మీడియట్ బోర్డు సమన్వయంతో సమగ్ర డేటా సేకరణ
- కుటుంబ ఆదాయం నెలకు గ్రామాల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు మించరాదు.
- ఖచ్చితంగా బియ్యం కార్డు ఉండాలి.
- భూమి మూడు ఎకరాల కంటే తక్కువ ఉండాలి.
- నాలుగు చక్రాల వాహనం కలిగి ఉంటే (ట్రాక్టరు, ఆటోలకు మినహాయింపు) వారు అనర్హులు.
- నెలవారీ విద్యుత్ వినియోగం 300 యూనిట్ల కంటే తక్కువ ఉండాలి. 12 నెలల సగటు విద్యుత్ వినియోగాన్ని పరిగణనలోకి తీసుకుంటారు.
- కుటుంబానికి వేయి చదరపు అడుగులకంటే ఎక్కువ విస్తీర్ణంలో మునిసిపల్ ఆస్తి ఉండకూడదు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుతాల్లో పీఎస్‌యూలు లేదా ప్రభుత్వ పెన్షన్ పొందుతుంటే అనర్హులు.
- పారిశుధ్య కార్మికులకు మినహాయింపు ఉంది.
- గ్రామాల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు జీతం పొందే ఉద్యోగులకు మినహాయింపు ఉంది.
- ఆదాయ పన్ను చెల్లిస్తే అర్హులు కారు.
- లబ్ధిదారుడి పిల్లలు ఏపీలో గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదవాలి.
- ఈ విద్యా సంవత్సరంలో 75 శాతం హాజరు ఉన్న విద్యార్థి తదుపరి వచ్చే ఆర్థిక సంవత్సరానికి సహాయం పొందడానికి అర్హులు.
- డీబీటీ విధానంలో తల్లుల ఖాతాలకు జమ

'వికసిత్ భారత్' లక్ష్యంగా ప్రధాని మోదీ పాలన

» వృత్తి నిపుణుల సదస్సులో కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ



కాకినాడలో జరిగిన వృత్తి నిపుణుల సదస్సులో మాట్లాడుతున్న భూపతిరాజు శ్రీనివాసవర్మ

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ పనిచేస్తున్నారని, ప్రస్తుతం అమృతకాలం నడుస్తోందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు. సుపరిపాలన, పేదల సంక్షేమానికి మోదీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఈ నేపథ్యంలో వృత్తి నిపుణులు అభివృద్ధి, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తోడ్పడాలని కోరారు. కాకినాడ దేవాలయం వీధిలోని పైడా చలమయ శ్రీనివాసు కల్యాణ మండపంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అధ్యక్షతన వృత్తి నిపుణుల సదస్సు గురువారం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర సహాయమంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ సమాజంలో వృత్తి నిపుణులది కీలకపాత్రని, అటువంటి వృత్తి నిపుణులంతా దేశ ప్రగతి, అభివృద్ధి పథంలో ప్రధాని మోదీకి మద్దతు పలకాలని అన్నారు. కాకినాడ జిల్లాకు కేంద్ర ప్రభుత్వం అనేక వరాలు ప్రకటించిందని వాటిని వివరించారు. కాకినాడ నగరాన్ని స్మార్ట్‌సిటీగా ఎంపిక చేయడంతోపాటు నగరంలో ఇళ్లు లేని పేదలకోసం 78వేల ఇళ్లను మంజూరు చేసింది మోదీ మాత్రమేనన్నారు. గ్రామీణ సడక్ యోజనతోపాటు జాతీయ రహదారులను నిర్మిస్తూ దేశ ప్రగతికి ప్రధాని దోహదపడుతున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి మోదీ అండగా ఉంటున్నారని, పోలవరం, అమరావతి వంటి నిర్మాణాలకు పూర్తి సహకారం అందిస్తున్నారని అన్నారు. ముందుగా మంత్రి బీజేపీ నేతలతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం చల్ల కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.సూర్యనారాయణరాజు, జిల్లా ఇన్‌చార్జి రావూరి సుధ, పైడా కృష్ణమోహన్, యెనిమిరెడ్డి మాలకొండయ్య, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న శ్రీనివాసవర్మ

జిల్లా దేవదాయ శాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన కనపర్తి

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లా దేవదాయశాఖాధికారిగా కనపర్తి నాగేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. దేవదాయ ధర్మదాయశాఖ అధీనంలోని జిల్లాలోని ఆలయాల అభివృద్ధితోపాటు భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కృషిచేస్తానన్నారు. బదిలీల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా దేవదాయ శాఖాధికారిగా పనిచేస్తున్న నాగేశ్వరరావు కాకినాడ జిల్లా అధికారిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను డీసీ కార్యాలయ సూపరింటెండెంట్, జిల్లాలోని పలు ఆలయాల ఈవోలు అభినందనలు తెలిపారు.

'పది' సప్లిమెంటరీ ఫలితాల్లో.. 86.51శాతం ఉత్తీర్ణత

కాకినాడ రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లాలో 86.51శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. ఈ పరీక్షలకు జిల్లాలో 5,248మంది హాజరుకాగా 4,540మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. వారిలో 2686మంది బాలురు, 1853మంది బాలికలు ఉన్నారని తెలిపారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఈనెల 19వతేదీ రాత్రి 11 గంటలలోపు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

● ఓపెన్‌స్కూల్ ఫలితాల్లో 90.93శాతం ఉత్తీర్ణత

పది, ఇంటర్ ఓపెన్ స్కూల్ ఫలితాల్లో 90.93శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు. పది పరీక్షలకు 441మంది హాజరుకాగా 401మంది ఉత్తీర్ణత సాధించగా ఇంటర్ సార్వత్రిక విద్య సప్లిమెంటరీ పరీక్షలకు 1131మంది హాజరుకాగా 985మంది ఉత్తీర్ణులైనట్లు ఓపెన్ స్కూల్ జిల్లా సమన్వయకర్త సాయివెంకటరమణ తెలిపారు.

'స్మార్ట్' ముగిసినట్టేనా?



» స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు ఈ ఏడాది డిసెంబరు నెలాఖరుకు పూర్తి చేయాలని ఉత్తర్వులు
» కాకినాడలో నెరవేరని లక్ష్యాలు
» 72 ప్రాజెక్టులకు రూ.978కోట్లు విడుదల
» స్మార్ట్‌సిటీ గడువు మూడుసార్లు పొడిగింపు

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహార మంత్రిత్వశాఖ దేశంలో ప్రకటించిన మొత్తం వంద స్మార్ట్ సిటీల్లో కాకినాడ ఒకటి. అన్ని నగరాలు తమ లక్ష్యాలను సాధించడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి తగినంత సమయం ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నారు. స్మార్ట్ సిటీస్ మిషన్ 2017లో ప్రారంభించారు. ఇప్పటికే 8ఏళ్లు పూర్తయింది. అయినా ప్రతిపాదించిన ప్రాజెక్టులు పూర్తికాలేదు. 2022తో స్మార్ట్‌సిటీ గడువు ముగియడంతో 2024, జూన్ 30 వరకు పెంచారు. జూన్ 30తో ఆ గడువు పూర్తవడంతో తిరిగి మరో 9 నెలలు 2025, మార్చి 31 వరకు గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. జూన్ వచ్చినా స్మార్ట్‌సిటీ మిషన్ మీద ఉత్తర్వులు రాలేదు. రెండు రోజుల క్రితం స్మార్ట్ సిటీ మిషన్ ప్రాజెక్టులన్నీ 2025, డిసెంబరు నెలాఖరుకి పూర్తి చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.

కాగితంపైనే పనులు

కాకినాడలో స్మార్ట్ సిటీ పథకం కింద అనేక పనులు ఇంకా అసంపూర్తిగా ఉన్నాయి. కాగితంపై పూర్తి చేసినట్లు కనిపించినా ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. స్మార్ట్ సిటీ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి కాకినాడకు మొత్తం రూ.వెయ్యికోట్లు మంజూరుకాగా అందులో ఇప్పటికే రూ.978కోట్లు మంజూరయ్యాయి. రూ.884.79కోట్లు పనులు జరిగాయి. రూ.784కోట్ల పనులకు సంబంధించి బిల్లులు క్లియర్ అయ్యాయి. ఇంకా రూ.101కోట్లకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్‌లో ఉన్న వర్క్‌లు పూర్తి చేయడానికి ఇంకా రూ.93కోట్లు అవసరం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం వాటా కింద రావాల్సిన నిధులు విడుదల కాగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంకా రూ.94 కోట్లు రావాల్సి ఉంది. స్మార్ట్ సిటీలో 72 పనులు చేపట్టగా 56కి పైగా పూర్తయ్యాయి. మిగిలిన 14 పనులను పూర్తి చేయాల్సి ఉంది.

నాలుగు నెలలుగా జీతాలు లేవు

స్మార్ట్ సిటీ ప్రారంభ దశలో అధికారులు, సిబ్బంది కలిపి 40మంది పనిచేసేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 21మందికి చేరింది. వీరికి నాలుగునెలలుగా జీతాలు ఇవ్వని పరిస్థితి నెలకొంది.

సిబ్బంది ఎందరంటే..

ఇంజనీరింగ్ సిబ్బంది(ఇన్‌చార్జి ఈఈ ఒకరు, ఏఈలు ఐదు, టెక్నికల్ కోఆర్డినేటర్ ఒకరు, నెట్‌వర్క్ ఇంజనీర్ ఒకరు, ట్రాన్స్‌పోర్టు ఇంజనీర్ ఒకరు), ఫైనాన్స్ సెక్షన్(కంపెనీ సెక్రటరీ ఒకరు, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ ఒకరు, ఫైనాన్స్ మేనేజర్ ఒకరు), సీసీసీ(చీఫ్ డేటా ఆఫీసర్ ఒకరు), ఆఫీస్ సిబ్బంది(ఆఫీసు సిబ్బంది ఏడుగురు, రిమోట్ కన్సల్‌టెంట్ ఒకరు)

ఈ ఏడాది చివరకు ప్రాజెక్టులు ముగించాలి

స్మార్ట్‌సిటీమిషన్‌లో భాగంగా తలపెట్టినప్రాజెక్టులను 2025, డిసెంబరు నెలాఖరుకు పూర్తి చేయాలని ఉత్తర్వులు అందాయి. నిధుల వెసులుబాటు లేక ప్రాజెక్టులు పూర్తి కాకపోవడంతో మూడుసార్లు గడువు పొడిగించిన ప్రభుత్వం డిసెంబరు 31 లోపు స్మార్ట్ సిటీ మిషన్ పనులు పూర్తవ్వాలని పేర్కొంది.

'భాగ్యనగర్' పరిశ్రమను వెంటనే తెరిపించాలి

● కంపెనీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్



పరిశ్రమ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, తదితరులు

గోపాలపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నగ్గొండలో మూసివేసిన భాగ్యనగర్ క్లోరైడ్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను యాజమాన్యం వెంటనే తెరిపించాలని ఆ కంపెనీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గురువారం నిరాహార దీక్ష చేపట్టింది. ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ యండపల్లి శేఖర్‌బాబుకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని యూనియన్ నేతలు అందజేశారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా తమ సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకోసం యూనియన్‌ను ఏర్పాటు చేసుకోవడం రాజ్యాంగం వారికి ఇచ్చిన హక్కు అన్నారు. కార్మికులంతా విధులకు హాజరై పనులు చేస్తామంటే యాజమాన్యం అక్రమంగా మూసివేయడం వెనుక ఏదో ప్రయోజనం ఉందని ఆరోపించారు. లేబర్ అనుమతి లేకుండా ఫ్యాక్టరీని మూసి వేయడం వెనుక అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. యాజమాన్యం స్పందించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, యూనియన్ అధ్యక్షుడు పెందుర్తి వెంకట్రాయుడు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహర్షి, యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, సోమరాజు, రాము, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

అద్భుత పథకాలు అందించిన ఘనత మోదీదే

- 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యం - కాకినాడలో కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ



కాకినాడ సదస్సులో మాట్లాడుతున్న కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

కాకినాడ, జూన్12 (ఆంధ్రజ్యోతి): ఏ దేశంలోనూ అమలు చేయలేని అద్భుత పథకాలను ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం మనదేశంలో అమలు చేసిందని కేంద్ర సహాయ శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కాకినాడలోని పైండా చలమయ్య శ్రీనివాస కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన వృత్తినిపుణుల సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అధ్యక్షతన సదస్సును కేంద్రమంత్రి జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 2014లో పూర్తి మెజారిటీతో మోదీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. అనంతరం ప్రభుత్వం ఈ 11 ఏళ్లలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించేలా ఏర్పాటుచేసిన ప్రదర్శనను ప్రారంభించారు. సదస్సులో బీజేపీ నేతలు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, వేటుకూరి సూర్యనారాయణ రాజు, సాల గ్రామ లక్ష్మీప్రసన్న, తుమ్మల పద్మజ, రావూరి సుధ, పైడా కృష్ణమోహన్, వెంగమాంబ శ్రీనివాసరావు, కే. భీమశేఖర్, మీడియా కో-ఆర్డినేటర్ తుమ్మల నారాయణరావు(నాని), సింగిలిదేవి సత్తిరాజు, యార్లగడ్డ రామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

● ఇనుప గెడ విద్యుత్ వైర్లకు తగిలి కూలీ ...
రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు...
'గోదావరి'లో గుర్తుతెలియని వ్యక్తి...

నల్లజర్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం సుబ్రహ్మపాలెంకి చెందిన కొబ్బరి దింపు కార్మికుడు తిప్పనబోయిన శ్రీను (35) గురువారం కొబ్బరికాయలు తీస్తుండగా ఇనుప గెడ విద్యుత్ వైర్లకు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. శ్రీను పోతవరం శివారులోని రైతు వెల్లంకి కృష్ణ కొబ్బరితోటలో కాయలు తీసేందుకు గురువారం కూలీ పని నిమిత్తం వెళ్లాడు. ఈ క్రమంలో ఇనుప గెడ పక్కనే ఉన్న విద్యుత్ వైర్లపై పడిపోవడంతో మృతిచెందాడు. ఈయనకు భార్య సుధారాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లి గూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.



సంఘటనా స్థలంలో శ్రీను మృతదేహం

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు గ్రామస్థులు, తదితరులు కోరుతున్నారు.

కొవ్వూరు: గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి. విశ్వం తెలిపారు. పట్టణంలోని భక్తాంజనేయ స్నానఘట్టంలో గురువారం సుమారు 40 నుంచి 45 సంవత్సరాల మగ మృతదేహం తేలుతుందని స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్థానిక జాలర్ల సహకారంతో నది నుంచి బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదు.. ఆచూకీ తెలిసినవారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గానీ, 9440796622 నెంబర్‌కు గానీ సమాచారం అందించాలని సీఐ తెలిపారు.

రాజోలు: రాజోలులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెన్నేటి నగర్‌కు చెందిన పి.పురుషోత్తం (72) మోటారు సైకిల్ ఢీకొని మృతిచెందినట్టు రాజోలు ఏఎస్ఐ కె.నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం రాజోలు తెన్నేటి నగర్‌కు చెందిన పురుషోత్తం రాజోలు సెంటర్‌లో ఉన్న కాఫీ షాపుకి వెళుతుండగా రాజోలు నుంచి శివకోడు వైపు వెళుతున్న మోటారు సైకిల్‌పై వెళుతున్న వ్యక్తి అతివేగంగా సైకిల్‌ను ఢీకొట్టడంతో కిందపడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో వెంటనే స్థానికులు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే పురుషోత్తం మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య వెంకట సుబ్బలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

'చిరంజీవినీకుమారి గొప్ప మానవతావాది'



సంస్మరణ సభలో పాల్గొని పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

కాకినాడ రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ విద్యావేత్త, ఐడీఎల్ విద్యాసంస్థల కరస్పాండెంట్, కార్యదర్శి డాక్టర్ పాలెపు చిరంజీవినీకుమారి గొప్ప మానవతావాది అని పలువురు కొనియాడారు. గురువారం కాకినాడ జిల్లా కాకినాడ-సామర్లకోట రోడ్డులోని ఐడీఎల్ కళాశాల సెమినార్‌హాల్లో సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం ప్రతినిధులు, పూర్వ అధ్యాపకులు చిరంజీవినీ కుమారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆమెతో గల తమ జీవిత అనుభవాలను, అనుభూతిని, అనుబంధాలను గుర్తుచేసుకున్నారు. సంస్మరణసభను డీవీఎస్ఎన్ మూర్తి (మురళీ) ప్రారంభించగా, జీవీకే వర్మ అధ్యక్షత వహించారు. చిరంజీవినీకుమారి కాంస్య విగ్రహాన్ని కళాశాలలో ప్రతిష్ఠించాలని, అలాగే ఆమె పేరుమీద ఒక అవార్డు ఇవ్వాలని సంతాపసభలో పాల్గొన్న వారు సూచించారు. పీఎస్ఎస్ కిరణ్, జీవీ కృష్ణంరాజు, జి.రమేష్‌కాంత్, ఎంవీ చౌదరి, టి.బసవరాజు, ఎన్‌వీకే వర్మ, వాసు, ఎన్.రామరాజు, కోటగిరి సత్యంబాబు, పద్మావతి, సుబ్బారావు, శ్రీనివాసరావు, సత్తిరాజు, సుబ్బారాయుడు, వరప్రసాద్ పాల్గొన్నారు.

అన్నవరం దేవస్థానంలో క్షేత్రపాలకులకు

వెండి మకరతోరణం బహూకరణ



వెండి మకరతోరణాన్ని ఈవోకు అందజేస్తున్న పురోహితులు

అన్నవరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడి నిత్య కల్యాణం జరిపించే సమయంలో క్షేత్రపాలకులు సీతారాముల ఉత్సవమూర్తులకు వెనుక భాగంలో అలంకరించేందుకు గురువారం వ్రత పురోహితుల్లో కొందరు రూ. మూడు లక్షల విలువ చేసే 2345 గ్రాముల వెండితో తయారు చేయించిన మకరతోరణం ఈవో సుబ్బారావుకు అందజేశారు. అల్లంరాజు శ్రీనివాస్, గుత్తిన రామకృష్ణ, నాగాభట్లరవిశర్మ, ఇతర డ్యూటీసభ్యులు 43 మంది కలిపి వీటిని అందజేశారు ఈవో వారిని అభినందించారు. సత్యదేవుడి సన్నిధిలో పనిచేస్తూ స్వామి నిత్యకల్యాణంలో అవసరమైనవి గుర్తించి దాన్ని విరాళంగా అందజేయడం అభినందనీయమని ఈవో తెలిపారు.

ద్రాక్షారామ భీమేశ్వరస్వామి

ఆలయానికి 8 కూలర్లు అందజేత

ద్రాక్షారామ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వర స్వామివారి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన అనుమోలు దేవా కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో రూ.లక్ష విలువ చేసే ఎనిమిది కూలర్లను గురువారం సమకూర్చారు. వీటిని ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవానీకి అందించారు. ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



భీమేశ్వరస్వామి ఆలయంలో కూలర్లు అందజేస్తున్న దృశ్యం

లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన సహాయ కమిషనర్‌గా ప్రసాద్



నూతన ఏసీ ఎంకేటీఎన్వీ ప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు, అధికారులు

అంతర్వేది, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థాన సహాయ కమిషనర్‌గా ఎంకేటీఎన్వీ ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు. అనంతరం స్వామిఆలయ కార్యాలయంలో ప్రసాద్ నూతన బాధ్యతలు స్వీకరించి అర్చకులు, సిబ్బందిని కలిసి మాట్లాడారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన వి.సత్యనారాయణ జిల్లా ఏసీగా కొనసాగుతున్నారు.



స్వామి ఆలయంలో బాధ్యతలు స్వీకరిస్తున్న ఏసీ ఎంకేటీఎన్వీ ప్రసాద్

1,268 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యంతో పట్టుబడిన వాహనం

రాజానగరం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): తుని నుంచి జగ్గంపేటకు బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు గురువారం రాజానగరంలో పట్టుకున్నారు. ఈమేరకు ఎంఎస్‌వో గొలుగూరి బాపిరాజు తెలిపిన వివరాలు ప్రకారం... బొలేరో వాహనంలో వివిధ రంగులతో కూడిన 32 ప్లాస్టిక్ సంచుల్లో 1,268 కిలోల బియ్యాన్ని రవాణా చేస్తుండగా పట్టుకున్నామన్నారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.58,328 కాగా వాహనం విలువ రూ.1.50 లక్షలు వెరసి రూ.2,08,328గా నిర్ధారించారు. యజమాని జగ్గంపేటకు చెందిన మారిశెట్టి గణేష్, అదే గ్రామానికి చెందిన డ్రైవర్ గట్టెం సత్తిబాబు పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారన్నారు. బియ్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి, నిందితులపై రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

భర్త హత్య కేసులో భార్య, ప్రియుడు అరెస్టు



బిక్కవోలులో విలేకర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ విద్య

బిక్కవోలు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలులో మంగళవారం అర్ధరాత్రి జగనన్న కాలనీలో కెంగం శ్రీనును హత్య చేసిన కేసులో అతని భార్య దేవి, ప్రియుడు జంపా దుర్గారావును గురువారం అరెస్టు చేసినట్టు రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య గురువారం రాత్రి బిక్కవోలు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. దేవి, దుర్గారావు మద్యం మత్తులో వున్న శ్రీనును తలపై ప్లాస్టిక్ స్టూల్‌తో బలంగా కొట్టి అతడి షర్ట్‌తో ముక్కు, నోరు నొక్కి ఊపిరి ఆడకుండా చేసి చంపారన్నారు. ఇద్దరూ స్థానిక వీఆర్వో పోతురాజు ఎదుట సరెండర్ అవ్వడంతో సీఐ సుమంత్ వీరిని అదుపులోకి తీసుకుని అనపర్తి కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించారన్నారు. సమావేశంలో ఎస్ఐ వి.రవి చంద్రకుమార్ ఉన్నారు.

మహిళా సిబ్బందితో స్వీపర్ అసభ్య ప్రవర్తన

- ఉద్యోగిని ఫొటోలు సెల్‌లో చిత్రీకరణ
- ప్రతిఘటించడంతో నెట్టేసిన వైనం
- కరప పీహెచ్‌సీలో సిబ్బంది ఆందోళన

కరప, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప పీహెచ్‌సీలో స్వీపర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాజాబాబు నిర్వాకంపై అక్కడ పనిచేస్తున్న మహిళా సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూగ, చెవిటి వాడైన రాజాబాబు రెండేళ్లుగా ఈ పీహెచ్‌సీలో పనిచేస్తున్నాడు. విధులు సక్రమంగా నిర్వహించకపోవడంతో పాటు మహిళా సిబ్బంది ఫొటోలు తీస్తూ, వారిని మానసికంగా వేధిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నాడని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం విధుల్లో ఉన్న గర్భిణీ అయిన ఒక ఉద్యోగి ఫొటోలను సెల్‌లో చిత్రీకరిస్తుండడంతో ఆమె ప్రతిఘటించింది. దీంతో ఆమెను యూడీసీ సమక్షంలోనే కిందకు నెట్టేయడంతో ఆ మహిళా ఉద్యోగి కన్నీటిపర్యంతమయ్యింది. గతంలో పెద్దాడ పీహెచ్‌సీలో పనిచేసినప్పుడు కూడా అతను ఇలాగే ప్రవర్తించేవాడని, ఎన్నిసార్లు మందలించినా పట్టించుకోకుండా మహిళా సిబ్బంది పట్ల అసభ్యంగా మెలుగుతున్నట్టు తెలుస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి బాధ్యుడిపై చర్యలు తీసుకోవాలని పలువురు సిబ్బంది విజ్ఞప్తిచేస్తున్నారు. ఈ వ్యవహారంపై పీహెచ్‌సీ వైద్యాధికారిణి అఫ్రోజ్‌ను వివరణ కోరగా స్వీపర్ రాజాబాబు మహిళా సిబ్బంది ఫొటోలు తీస్తున్నాడని తెలిసి మందలించామన్నారు. దీనిపై డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

శ్రీకామాక్షీ చారిటబుల్ ట్రస్టు ఎన్నిక

అమలాపురం టౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): అమలాపురం కూచిమంచి అగ్రహారంలోని శ్రీకామాక్షీ పీఠ మహా సంస్థానానికి చెందిన శ్రీకామాక్షీ దేవి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు, పీఠాధిపతి కామేశ మహర్షి ఇటీవల శివైక్యం చెందారు. దాంతో గత ఆదేశాలను అనుసరించి గురువారం శాశ్వత సభ్యురాలు వక్కలంక వాణిని ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమెతో పాటు మద్రి దుర్గారావు, మట్టపర్తి సత్యనారాయణ, వీరా నాగేశ్వరరావుతో పాటు పీఠ ముద్రాధికారి ఉప్పులూరి విఘనస రాజీవ్‌ప్రేమ్‌ను కామేశమహర్షి స్థానంలో నియమించారు. పీఠంలో యథావిధిగా పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. విరాళాలు అందిస్తున్న దాతలకు ట్రస్టు తరపున కృతజ్ఞతలు తెలిపారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

గోకవరం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గడ్డి మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గోకవరం మండలం రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన సన్నపు నాగేంద్రుడు(53) ఇంటి వద్ద గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయాన్ని తెలుసుకున్న కుటుంబసభ్యులు గోకవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కాగా నాగేంద్రుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

అవిభక్త కవలల తొలగింపు



చింతూరు, జూన్ 12 (ఆంధ్రజ్యో): తల్లికి ప్రాణాపాయం ఏర్పడే పరిస్థితిని ముందుగా గుర్తించిన వైద్యులు శస్త్ర చికిత్స ద్వారా అవి భక్త కవలలను తొలగించారు. వివరాలిలా ఉన్నాయి... అల్లూరి జిల్లా చింతూరు మం డలం కుమ్మూరుకు చెందిన గర్భవతి వీర మణి దంపతులు ఈ నెల 7న చింతూరు ఏరియా ఆసుపత్రికి సాధారణ పరీక్షల నిమి త్తం వెళ్లారు. పరీక్షించిన గైనకాలజిస్ట్ డాక్టర్ శశికళ వీరమణి గర్భంలో ఉన్న ఆందోళన పరిస్థితిని పసిగట్టారు. అత్యాధునిక స్కానింగ్ నిమిత్తం రేడియాలజిస్ట్‌ని సంప్రదించాలని ఆమెతో పాటు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి సూచించారు. దీంతో వీరమణి ని భర్త ప్రసాద్ తెలంగాణ రాష్ట్రం భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి వీరమణి గర్భంలో ఉన్న అవిభక్త కవలలను తొలగించాలని, లేకుంటే తల్లి ప్రాణాలకు ప్రమాదం ఉందని వివరించారు. వీరమణి దంపతుల అభీష్టం మేరకు శస్త్ర ద్వారా అవిభక్త కవలలను తొలగించారు. తల్లి ఆరోగ్యంగా ఉందని వైద్యులు చెప్పారు.

పరిశోధనలు అత్యంత అవసరం

- ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, కార్డియాలజీ నిపుణుడు డాక్టర్ చంద్రశేఖర్
- కాకినాడ రంగరాయలో అట్టహాసంగా ఎరెవ్నా 4.0
- సదస్సుకు 600 మంది వైద్య విద్యార్థులు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న వీసీ డాక్టర్ చంద్రశేఖర్

జీజీహెచ్ (కాకినాడ), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గతంలోలా కేవలం నేర్చుకోవడంతో సరిపెడదామంటే వైద్యవిద్యలో రాణించలేమని, పరిశోధన అత్యంత ఆవశ్యకమని వివరించారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, ప్రముఖ కార్డియాలజీ నిపుణుడు డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. కాకినాడ ఆర్ఎంసీ, ఫార్మకాలజీ విభాగంలో ఎరెవ్నా 4.0 గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ చంద్రశేఖర్ జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ ఆధ్వర్యం లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సుమారు 600 మంది వైద్య విద్యార్థులు హాజరయ్యారు. అకడమిక్ డీఎంఈ డాక్టర్ రఘునందన్ విశిష్ట అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎరెవ్నా సదస్సు వైద్య విద్యార్థుల భవితను బంగారుమయం చేస్తుందన్నారు. వైద్య ప్రక్రియలో నూతన పోకడలు ఎరెవ్నా సదస్సు ద్వారా విద్యార్థులు నేర్చుకోవచ్చని అభిప్రాయపడ్డారు. విద్యా వ్యవస్థ పూర్తిగా ఆధునికమైందని చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. డాక్టర్ రఘునందన్ మాట్లాడుతూ వైద్య రంగంలో వస్తున్న కొత్త పోకడలను అనుసరించడం ద్వారా వైద్యులుగా మరింత రాణించే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. దేశ, విదేశాల్లో భారతీయ వైద్యులకు ఎనలేని డిమాండ్ ఉందని, ప్రభుత్వ రంగాల్లో కూడా స్థిరపడేందుకు అవకాశాలు ఇటీవల పెరిగాయన్నారు. అనంతరం వైద్య విద్యార్థులు వివిధ అంశాలపై 14 వర్క్‌షాపులు నిర్వహించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి,ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శశి, డాక్టర్ ఉమామహేశ్వరరావు, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల మృతికి సంతాపం

అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో సుమారు 20 మందికి పైగా వైద్య విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినట్టు నిర్ధారణ కావడంతో వైద్య విద్యార్థులంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ నేపథ్యంలో కాకినాడలో ఎరెవ్నా సదస్సుకు హాజరైన 600 మంది ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు.

నర్సుల బదిలీల ప్రక్రియలో వివాదం

- ఈసీ మెంబర్లుగా లేని ఇద్దరికి బదిలీ నుంచి మినహాయింపు కోరిన జిల్లా నర్సింగ్ అసోసియేషన్
- కలెక్టర్, ఆర్డీలను తప్పుదోవ పట్టించారంటూ ఆరోపణలు
- విజిలెన్స్‌కు చేరిన వివాదం

జీజీహెచ్ (కాకినాడ), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నర్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివాదం చోటుచేసుకుంది. నర్సుల బదిలీలలో మాయాజాలానికి అగ్రనాయకత్వం అడ్డదారులు తొక్కిందని ఆరోపణలు వినబడుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. తాజా నర్సింగ్ జిల్లా అసోసియేషన్ గత ఏడాది నవంబర్‌లో ఎన్నికల ద్వారా ఏర్పడింది. ఈ ఎన్నికల్లో మొత్తం 9 మంది ఎన్నికయ్యారు. వీరిలో ఐదుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లున్నారు. అయితే ప్రభుత్వం ప్రస్తుతం అన్ని ప్రభుత్వ శాఖలకు బదిలీల ఉత్తర్వులు ఇచ్చింది. ఈ క్రమంలోనే సంఘ నాయకత్వానికి షరతుల ద్వారా మినహాయింపులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో సంఘ కార్యవర్గానికి గిరాకీ పెరిగింది. జిల్లా నర్సింగ్ అసోసియేషన్ కూడా ఇందుకు ఏ మాత్రం తీసిపోలేదు. కొద్ది రోజుల క్రితం ఆ సంఘ నాయకులు కలెక్టర్ షాన్‌మోహన్ ద్వారా ఆర్డీ డాక్టర్ పద్మశశిధర్‌కు సాధారణ బదిలీల్లో భాగంగా అన్ని శాఖలు చేస్తున్నట్టే తమ సంఘ నాయకుల జాబితాను పంపారు. ఆఫీస్ బేరర్ల హోదాలో ఆ జాబితాలో ఉన్న ఇద్దరు ఈసీ మెంబర్లకు బదిలీ నుంచి మినహాయింపు ఇవ్వాలని విన్నవించారు. వీరు కోరిన ఆ ఇద్దరు అసలు ఈసీ మెంబర్లే కాదు. వారు కనీసం ఎన్నికల్లో కూడా పోటీ చేయలేదు. గొల్లపల్లి సుశీలా రాణి, మందపల్లి నీలమణి అనే కాకినాడ జీజీహెచ్‌లో పని చేస్తున్న ఇద్దరు స్టాఫ్ నర్సులు పేర్లను ఈ జాబితాలో చేర్చి కలెక్టర్, ఆర్డీలను తప్పుదోవ పట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. వారి స్థానంలో నిజానికి ఎన్నికైన వారు మచ్చా సుజాత, కె.దేవి అనే ఇద్దరు ఈసీ మెంబర్లు అయితే కె.దేవిని రాష్ట్ర ఈసీ మెంబర్‌గా చూపిస్తూ విన్నతిపత్రంపై పెన్‌తో రాసి రాష్ట్ర పరిధికి నెట్టేశారు. అలాగే ఎన్నికల్లో ఎన్నికైన మరో ఈసీ మెంబర్ మచ్చా సుజాత పేరు అసలు ఈ జాబితాలో లేనేలేదు. ఈ విషయం పై అప్పుడు ఎన్నికలు నిర్వహించిన అధికారులను వివరణ కోరగా ఈసీ మెంబర్ల హోదాలో సుశీలారాణి, నీలమణి అనేవారి పేర్లు లేవని తేల్చారు. ఈ వివాదం కాస్తా విజిలెన్స్ అధికారులకు చేరింది.

అప్పుల బాధలు తాళలేక లారీ ఓనర్ ఆత్మహత్య



మణికంఠ(ఫైల్)

కాకినాడ క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కిరాయిలు లేకపోవడంతో జీవనోపాధిని నెట్టుకు రావడం కష్టంగా మారి ఓ లారీ ఓనర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ, సూర్యనారాయణపురానికి చెందిన లకమన వీర మణికంఠ (35) కొంతకాలం లారీలపై పని చేస్తూ ఆ అనుభవంతో ఏడాది క్రితం సొంతగా మూడు సెకెండ్ హ్యాండ్ లారీలను ఫైనాన్స్‌లో వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో కాకినాడ పోర్ట్ సహా వివిధ ప్రాంతాలకు లారీలు తిప్పేవాడు. అయితే కొంతకాలంగా పోర్ట్ ప్రాంతంలో వివాదాలు అలుముకోవడంతో ఎగుమతి, దిగుమతులకు గండి పడి లారీల వ్యాపారం ఘననీయం గా తగ్గింది. దీంతో మణికంఠ అప్పులు పాలయ్యాడు. ఒక పక్క లారీలకు సంబంధించిన వాయిదాలు కట్టలేకపోవడంతో గతవారంలో సంతచెరువు సమీపంలో ఉన్న ఫైనాన్స్ కంపెనీ రికవరీ ఏజెంట్లు వచ్చి మూడు లారీలను పట్టుకుపోయారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన వీరమణికంఠ బుధవారం రాత్రి పోర్ట్ రైల్వేస్టేషన్ సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనంతరం స్థానికులు గమనించి జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- పురుగులు మందు తాగి బలవన్మరణం
- చికిత్స పొందుతూ మృతి

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

కాకినాడ ఎంపీని కలిసిన వికాస్

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) రాష్ట్ర స్థాయి కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా ఇటీవల నియమితుడైన మద్దా వికాస్ గురువారం కాకినాడలో ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేయాలని ఎంపీ సూచించారు. అలయన్స్ క్లబ్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ ఉపేంద్రనాథ్, అలయన్స్ క్లబ్ ఆఫ్ స్వాతి కార్యదర్శి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురంలో ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వర్మ, టీడీపీ నాయకులు


కరపలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


కాకినాడ రూరల్‌లో పేద మహిళకు చీర అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి దంపతులు

ఏడాది పాలన... టీడీపీ సంబరాలు

కాకినాడ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా గురువారం కాకినాడలో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీ విజయవంతమైంది. బాణసంచా కాల్పులు, తప్పెటగుళ్లు, సర్వమత ప్రార్థనలు, తెలుగు తమ్ముళ్ల సంబరాలతో హోరెత్తింది. నగరం పసుపుమయమైంది. బాలాజీ చెరువు సెంటరు వద్ద ప్రారంభమైన ర్యాలీ మెయిన్‌రోడ్, దేవాలయం వీధి మీదుగా తిరిగి అక్కడకే చేరుకుంది. ప్రజలు, వ్యాపారులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. భారీ గజమాలతో ఎమ్మెల్యే కొండబాబును సత్కరించారు. తొలుత విద్యార్థులతో భారీ కేక్ కట్ చేయించారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, నియోజకవర్గ పరిశీలకుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, టీడీపీ నగర శాఖ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, సూపర్‌బజార్ చైర్మన్ ప్రెసింగి ఆదినారాయణ, ది గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గ్రంధి బాబ్జీ, కాకినాడ మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్, నాయకులు సుంకర తిరుమలకుమార్, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, ఎంఏ తాజుద్దీన్, గదుల సాయిబాబు, సీకోటి అప్పలకొండ, వనమాడి మోహనవర్మ, నల్లూరి శ్రీనివాస్, అమన్‌జైన్, అంబటి చిన్న, మేడిశెట్టి చిన్ని, పాలిక నాని, అమలకంటి బలరామ్, బలసాడి రంగారావు, రెడ్డం సత్తిబాబు, మోసా పేతూరు, మూగు రాజు, మల్లిపూడి నాగదీపిక, తుమ్మల సునీత, కొవనాతి నాగకుమారి, వడిశెల దాలమ్మ, పీర్ల లక్ష్మీప్రసన్న, నల్లూరి తులసి, మూడు చిన్ని, పట్టా ధనలక్ష్మి, పంతాడి రాజు, ఓలేటి పాండురంగడు, సంగాని నాగేశ్వరరావు, గూడవల్లి ముత్యం, అల్లం రాజు, ఎలిపే శ్రీనివాస్, లూటుకుర్తి మోహన్, పినపోతు దుర్గారావు, పాలిక సూర్య తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు ఆధ్వర్యంలో పెద్ద మార్కెట్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కటౌట్‌కు మహిళలు పాలాభిషేకం చేశారు. పేదలకు చీరలు పంపిణీ చేసి భోజన ఏర్పాట్లు చేశారు. మండపాక సత్యనారాయణ, బత్తుల సూర్యప్రసాద్, అడపా జగదీష్, మండపాక నాగబాబు, అంగాని శేషగిరివర్మ, మచ్చినపల్లి పార్వతి, విజయలక్ష్మి, సత్యవతి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ (ఆంధ్రజ్యోతి): ఇంద్రపాలెం కల్యాణ మండపంలో మాజీ ఎంపీటీసీ మాసు మేను గంగయ్య ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలను కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు పంపిణీ చేశారు. కాకినాడ రూరల్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్‌బాబా గైగోలుపాడులోని తన నివాసం వద్ద కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. రూరల్ నియోజకవర్గ పరిశీలకుడు నులుకుర్తి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంద్రపాలెం ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుంచి ఎంపీ సానాసతీష్ క్యాంపు కార్యాలయం వద్దకు బైక్ ర్యాలీ నిర్వహించారు. వలసపాకల లోని మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి నివాసం నుంచి సర్పవరం కూడలి వరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాదయాత్ర చేపట్టారు. సర్పవరం కూడలిలలోని ఎన్టీఆర్ విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు.

కరప (ఆంధ్రజ్యోతి): కరప ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ సీనియర్ నేత చుండ్రు వెంకన్నరాయచౌదరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీ కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. బుంగా సింహాద్రి, మద్దూరి స్వామి, పులపకూర మహేష్, గంటా వీరన్నచౌదరి, కాకర్ల బుజ్జిబాబుచౌదరి, కంటే సత్తిబాబు, చాట్ర ఇమ్మానుయేల్, గొల్లపల్లి బుజ్జి, రెడ్డి వీరవెంకట సత్యనారాయణ, చీపురుపల్లి జయేంద్రబాబు, పంపన కన్నారావు, వెలుగుల లచ్చారావు, గొర్రెల వెంకన్న, మేడిశెట్టి పట్టాభి, నాగం బాబులు, మట్టపర్తి కొండ, ఉమ పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీసిందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక సుధా కాలనీలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద కూటమి ప్రభుత్వం తొలి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయనతో పాటు డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) పాల్గొన్నారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కూటమి నేతలు రాజా సూరిబాబురాజు, నూనే రామారావు, ఎలిశెట్టి నాని, పోలమరశెట్టి సత్తిబాబు, అడబాల కుమారస్వామి, గుత్తుల సూర్యావతీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): చంద్రబాబునాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం పాలనాపగ్గాలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా పిఠాపురంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో గురువారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు కట్ చేసి కార్యకర్తలకు పంచారు. నేతలు సాగి వెంకట సుబ్బరాజు, పొన్నమండ రామలక్ష్మి, కట్టా త్రిమూర్తులు, టేకుమూడి లక్ష్మణరావు, ధూళిపూడి వెంకటరమణ, పెసింగి ఈశ్వరరావు, టిల్లపూడి నాగేశ్వరరావు, వుంగరాల వెంకటేశ్వరరావు, ముత్యాల జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తల్లీకొడుకులకు రెండు గోకులాలు మంజూరు చేస్తారా!

సామర్లకోట మండల సమావేశంలో పెదబ్రహ్మదేవం ఎంపీటీసీ సూర్యారావు ధ్వజం

సామర్లకోట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పెదబ్రహ్మదేవంలో ఒకే ఇంట్లో నివాసం ఉంటున్న తల్లీకొడుకులకు ఉపాధి హామీ పథకంలో రెండు గోకులాలు మంజూరు చేసి, బిల్లులు విడుదల చేసి అక్రమాలకు పాల్పడుతున్నా మండల పరిషత్ అధికారులు నిద్రపోతున్నారని పెదబ్రహ్మదేవం ఎంపీటీసీ మలకల సూర్యారావు ఉపాధి హామీ అధికారులపై తీవ్రంగా ధ్వజమెత్తారు. సామర్లకోట మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బి.సత్తిబాబు అధ్యక్షతన గురువారం సాయంత్రం జరిగింది. వివిధ శాఖల ప్రగతిని అధికారులు వివరిస్తున్న తరుణంలో ఉపాధి హామీ అధికారుల అక్రమాలు, అవకతవకలను అధికారుల దృష్టికి ఎంపీటీసీ సూర్యారావు తీసుకువచ్చారు. గ్రామంలో ఇప్పటికే తోటకూర మునీశ్వరరావు పేరిట గోకులం మంజూరు చేయగా, అతడి తల్లి చంద్రావతి పేరిట మరో గోకులం అక్రమంగా మంజూరు చేయడమే గాక పీడబ్ల్యుడీ స్థలంలో అక్రమంగా నిర్మించి అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు.

ఉపాధి అధికారి అవకతవకలపై పీడబ్ల్యుడీ అధికారులకు తాము ఫిర్యాదు చేయడంతో అప్పట్లో పీడబ్ల్యుడీ అధికారులు దర్యాప్తు జరిపి ప్రభుత్వ స్థలంలో గోకులం నిర్మించడం అక్రమణేనని నిర్ధారించారన్నారు. ఉపాధి హామీ ఏపీవో ఈ అక్రమాలకు పాల్పడ్డాడని.. ఉన్నతాధికారులు సత్వరం దర్యాప్తు జరిపి అర్హులైన పేదలకు గోకులాలు మంజూరు చేయాలని ఎంపీపీ, ఎంపీడీవోలను సూర్యారావు డిమాండ్ చేశారు. దీనికి సమాధానం చెప్పలేక ఉపాధి హామీ ఏపీవో రాజబాబు నీళ్లునమిలారు. తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి జోక్యం చేసుకుని గోకులం నిర్మించిన స్థలం ప్రభుత్వానిదా, ప్రైవేట్‌దా దర్యాప్తు చేసేలా వీఆర్వో, సర్వేయర్లను ఆదేశిస్తానని తెలిపారు. నీటి పన్నులు సకాలంలో చెల్లించి రెవెన్యూ శాఖ చేపట్టే అభివృద్ధి పనులకు రైతులు సహకరించాలని తహసీల్దారు చంద్రశేఖరరెడ్డి కోరారు. ఎంపీడీవో కరక హిమమహేశ్వరి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పీఏసీఎస్‌ల అధ్యక్షులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


పెద్దాపురం మండలం ఆర్బీకొత్తూరులో విద్యార్థికి పుస్తకాలు అందజేస్తున్న జేసీ రాహుల్‌మీనా

'విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి'

పెద్దాపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా పేర్కొన్నారు. మండలంలోని ఆర్బీ కొత్తూరు పాఠశాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కింద అందించే సన్న బియ్యం నాణ్యతను పరిశీలించారు. ప్రమాణాల్లో ఎటువంటి లోపాలున్నా బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠ్య పుస్తకాలను పరిశీలించి విద్యార్థులకు పంపిణీ చేశారు. తహసీల్దారు సీహెచ్ వెంకటలక్ష్మి, డీవైఈవో ప్రభాకరశర్మ, నూనే రామారావు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో గల బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. పిఠాపురం ఎంఈవో శ్యాంబాబు, పాఠశాల విద్యా కమిటీ చైర్‌పర్సన్ సూరంపూడి అనంతలక్ష్మి, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ బాలిపల్లి రాంబాబు, కౌన్సిలర్ కావాడి పోశయ్య, జనసేన నాయకులు బండి రవి, పోలిశెట్టి చంద్రశేఖర్, గాది కోటేశ్వరరావు, సూరంపూడి బాలు, గెద్దాడ కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): ఉండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈవో పట్టపగలు పుల్లయ్య అకస్మికంగా తనిఖీ చేశారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో సమీక్షించారు. సన్నబియ్యంతో పలావు, బంగాళాదుంప కర్రీ, ఎగ్ మెనూతో భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలకు చేరిన సన్న బియ్యం నిల్వలను పరిశీలించి రిజిస్టర్లు పారదర్శకంగా అమలుచేయాలని ఆదేశించారు. బదిలీల్లో భాగంగా సామర్లకోట అయోధ్య రామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 15 మంది ఉపాధ్యాయులకు స్థానచలనం కలిగిందని ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయి రామకృష్ణ చెప్పారు. పాఠశాలలో చేరిన విద్యార్థులందరికీ అచ్చు, నోటు పుస్తకాలు అందజేశారు.


గొల్లప్రోలులో ట్యాంకర్ల ద్వారా నీరు పట్టుకుంటున్న ప్రజలు

ప్రజలకు తప్పని తాగునీటి ఇక్కట్లు

గొల్లప్రోలు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పట్లేదు. ఇప్పటికీ పూర్తిస్థాయిలో తాగునీరు అందక, ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న నీరు సరిపోక అవస్థలు పడుతున్నారు. అదనపు ట్యాంకర్లు అవసరాలు తీర్చలేకపోతున్నాయి. దీంతో ప్రజలు వివిధ ప్రాంతాల్లో గల నూతులపై ఆధారపడవలసి వస్తోంది. నగర పంచాయతీ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం, వేసవి కార్యాచరణకు తగ్గట్టుగా సిద్ధం కాకపోవడం శాపంగా మారింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణాలోపం, సమస్య ఎక్కడ ఉందో ఇప్పటికీ గుర్తించలేకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించాలని కోరుతున్నారు.


సామర్లకోట మండలం కొత్తూరులో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

అంగన్వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసాలు

గొల్లప్రోలు రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలు, మల్లవరం గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో గురువారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారులకు కొత్త సిలబస్ ప్రకారం పాఠ్య పుస్తకాలు వచ్చాయని ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్‌ఎస్‌కే దుర్గాదేవి తెలిపారు. అనంతరం అంగన్వాడీ పిలుస్తోందిలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ స్కూలు హెచ్‌ఎం సురేష్‌కుమార్, సూపర్‌వైజర్ మానసాదేవి తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమాదేవి ఆధ్వర్యంలో కొత్తూరు అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం జరిపారు. ముఖ్య అతిథులుగా హాజరైనఉమాదేవి, సుల్తానాబీబీ తల్లులు, బాలింతలు, గర్భవతులు, చిన్నారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వీరాంజనేయ సేవాదళ్ సౌజన్యంతో పలకలు, బలపాలు, కంచర్ల నాగేశ్వరరావు దంపతుల సౌజన్యంతో బిస్కట్లు, చాకెట్లు, లేస్ ప్యాకెట్లను అందజేశారు. అంగన్వాడీ సిబ్బంది బీవీఎస్ రత్నకుమారి, పి.సీతారత్నం, పద్మ, మంగతాయారు, చిన్నసూర్యప్రభ, సత్యవతి, మంగ, కోనె సత్యవతి, కుమారి పాల్గొన్నారు. ఐసీడీఎస్ సామర్లకోట ప్రాజెక్టు కార్యాలయంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ దుర్గాదేవి ఆధ్వర్యంలో మండలంలోని కొమరగిరి, చినకలవలదొడ్డి, మూలపేట గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. సూపర్‌వైజర్లు సారమ్మ, లలిత, నిర్మల, డీసీపీవో దుర్గారాణి, కార్యకర్తలు సుభాషిణి, సునీత, నీలవేణి, పలువురు ఆయాలు పాల్గొన్నారు.


మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

పొలమూరుపాడులో మంత్రి సుభాష్ పర్యటన

కాజులూరు (కరప), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కాజులూరు మండలం పొలమూరుపాడులో గురువారం మంత్రి వాసంశెట్టి సుభాష్ పర్యటించారు. మంచినీటి పథకాన్ని ప్రారంభించి మహిళలకు బిందెలతో తాగునీరందించారు. రోడ్ల నిర్మాణం, లో ఓల్టేజ్ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పంట పొలాలకు నీరు వెళ్లకుండా అడ్డుకుంటున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు మంత్రికి వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో జె.రాంబాబు, సర్పంచ్ పోతు వెంకటలక్ష్మి జ్యోతి, కాజులూరు, కోటిపల్లి నీటి సంఘాల అధ్యక్షులు లఖాని కృష్ణచైతన్య, దాట్ల విజయగోపాలరాజు, నామవానిపాలెం సర్పంచ్ భూపతిరాజు చిట్టిరాజు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు చవ్వాకుల నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ, ఎమ్మెమెస్ కమిటీల నియామకం

కాకినాడ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురం 19వ వార్డు గోలీలపేటలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎమ్మెమెస్ అనుబంధ కమిటీల నాయకుల సమావేశం ఎంఎస్పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పలివెల నవీన్ ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి సూరిపాక వాసుదేవరావు, జిల్లా కో-ఇన్‌చార్జి పసుపులేటి చిన్నబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మార్పీఎస్ వార్డు కమిటీ అధ్యక్షుడిగా పువ్వల దిలీప్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వినయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా సంతోష్‌కుమార్, జోసఫ్, కార్యదర్శిగా చిన్ని, ఎంఎస్పీ వార్డు కమిటీ అధ్యక్షుడిగా నందిక వీరబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విజయ్, ఉపాధ్యక్షులుగా రాజేష్, రవి, కార్యదర్శిగా తలుపులయ్య, ఎమ్మెమెస్ వార్డు కమిటీ అధ్యక్షురాలిగా ఏడిద దేవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుమ, ఉపాధ్యక్షురాలిగా రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా పద్మ, కార్యద ర్శిగా దివ్య, మిగిలిన కార్యవర్గ సభ్యులను నియ మించారు.

కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు వల్లూరి సత్తిబాబు, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పాపిరెడ్డి, ఎంఎస్పీ మహిళా విభాగం ఇన్‌చార్జి వరలక్ష్మి, నాయకులు మిరియాల వీరబాబు, పువ్వల భాస్కరరావు, తుమ్మలపల్లి చిన్న, నరుకుర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.


పిఠాపురంలో నిర్వహించిన యోగాంధ్రలో పాల్గొన్న పాడా పీడీ చైత్రవర్షిణి, అధికారులు

పిఠాపురంలో యోగాంధ్ర

పిఠాపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండు మునిసిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం యోగాంధ్ర నిర్వహించారు. ప్రజలు, ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందితో ఆయుష్ సిబ్బంది, యోగా ట్రైనర్స్ యోగా చేయించారు. పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి, ఏపీడీ వసంత మాధవి, కమిషనరు కనకారావు పాల్గొన్నారు.

టీడీపీ కోరింగ గ్రామ కమిటీ ఎన్నిక

తాళ్లరేవు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కోరింగ గ్రామ కమిటీ ఎన్నిక బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా జరిగింది. నేతలు వాడ్రేవు వీరబాబు, పొన్నమండ రామలక్ష్మి, జవ్వాది తాతాజీ, చంటిబాబు, టేకుమూడి సత్యనారాయణ, వెంటపల్లి ఉమామహేశ్వరి, తాతారావు, భైరవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు
అంతరాయం

గొల్లప్రోలు రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆర్‌డీఎస్ఎస్ స్కీములో గ్రామాలకు 24 గంటలు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాకు విద్యుత్ లైన్ల నిర్మాణం, చేబ్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం గొల్లప్రోలు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈ ప్రభాకర్ తెలిపారు. చెందుర్తి, వన్నెపూడి, కొడవలి, తాటిపర్తి, చినజగ్గంపేట, చేబ్రోలు, దుర్గాడ, మల్లవరం, ఎ.విజయనగరం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

పిఠాపురం రూరల్ (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం పి.దొంతమూరు సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎస్ పెద్దాపురం ఈఈ ప్రభాకర్ తెలిపారు. వెల్దుర్తి, పి.దొంతమూరు, రాయవరం, పి.తిమ్మాపురం, గోకివాడ, బి.కొత్తూరు గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు
దరఖాస్తుల ఆహ్వానం

పిఠాపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సుభాషిణి తెలిపారు. కంప్యూటర్ సైన్స్‌కు ఎంటెక్ (కంప్యూటర్స్), ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్), ఎంసీఏల్లో ఏదేని కోర్సుల్లో 55శాతం మార్కులు, కంప్యూటర్ అప్లికేషన్స్‌కు ఎంసీఏ, ఎంటెక్ (కంప్యూటర్స్)ల్లో 55శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 17వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

తలసీమియా చిన్నారులకు రక్తదానం

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ తహసీల్దారు జితేంద్ర ఆధ్వర్యంలో రేషన్ డీలర్లు, తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది రెడ్‌క్రాస్‌లో తలసీమియా బాధిత చిన్నారుల కోసం గురువారం రక్తదానం చేశారు. కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాల మేరకు దీనిని నిర్వహించారు. సూపరింటెండెంట్ కృష్ణకుమారి, రెడ్‌క్రాస్ కార్యదర్శి శివకుమార్, వైద్యులు పాల్గొన్నారు.

'విమాన ప్రమాదం దురదృష్టకరం'

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాదం అత్యంత దురదృష్టకరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లండన్ వెళ్తున్న విమానంలో భారతీయులతో పాటు ఇతర దేశీయులు, గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీని కోల్పోవడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు బీజేపీ జిల్లా శాఖ తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బీసీ చైతన్య వేదిక మహిళా కార్యదర్శి
దుర్గకు సత్కారం

కాకినాడ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ చైతన్య వేదిక మహిళా కార్యదర్శిగా ఎన్నికైన కాకినాడకు చెందిన శెట్టిబలిజ మహిళా శక్తి అధ్యక్షురాలు రాయుడు దుర్గను ఘనంగా సత్కరించారు. స్థానిక కొండయ్యపాలెంలో గురువారం ఉమ్మడి రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పన సంస్థ మాజీ చైర్మన్, బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యనమదల రవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ దుర్గ రాబోయే కాలంలో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఆమె బీసీలందరినీ చైతన్యపరిచి ఉద్యమాలు చేపట్టాలని కోరారు. బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి పెంకే రాజు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

'పని గంటల పెంపు తగదు'

పెద్దాపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు పని గంటలు పెంచడాన్ని నిరసిస్తూ తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నేతలు దారపురెడ్డి క్రాంతికుమార్, గడిగట్ల సత్తిబాబు, చింతల సత్యనారాయణ, లోవకుమారి, సిరిపురపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుపై
6(ఎ) కేసు నమోదు

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలో విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా రేషన్ షాపులను తనిఖీ చేశారు. షాపు నెం.17లో 590 కిలోల బియ్యం నిల్వలు అధికంగా ఉన్నట్టు గుర్తించామని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి రుద్రరాజు సత్యనారాయణరాజు తెలిపారు. పంచదార 285 ప్యాకెట్లు అధిక నిల్వలు ఉన్నట్టు గుర్తించారు. షాపుపై 6(ఎ) కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు. విజిలెన్స్ డీఎస్పీ బంగార్రాజు, ఏఎస్‌వో లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు

కనకదుర్గ ఆలయంలో చండీహోమం

అన్నవరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి తొలిపావంచా వద్ద పూజలందుకుంటున్న కనకదుర్గ ఆలయంలో గురువారం మూలానక్షత్రం సందర్భంగా చండీహోమం నిర్వహించారు. ఉదయం 9గంటలకు గణపతిపూజతో కార్యక్రమం ప్రారంభించి అమ్మవారికి చండీ, సప్తశతి పారాయణలు, మూలమంత్ర జపాలు పఠించారు. అనంతరం 11గంటలకు పూర్ణాహుతి జరిగింది.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



రంపచోడవరంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

కూటమి ప్రభుత్వ ఏడాది సంబరం

రంపచోడవరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ఆదేశాల మేరకు గురువారం టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. మాజీ ఎంపీపీ అడబాల బాపిరాజు, టీడీపీ నాయకులు పాటోజు సురేష్, వై.నిరంజనీదేవి, సిద్ద వెంకన్నదొర, పాకలపాటి సూర్యనారాయణరాజు, వైఎస్ బోస్, మంగ అబ్బులు పాల్గొన్నారు.

దేవీపట్నం (ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేటలోని టీడీపీ కార్యాలయం వద్ద మండల కన్వీనర్ మరిశెట్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. భారీగా ర్యాలీ నిర్వహించారు. దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, కూటమి నాయకులు బాబూరావు, రాయుడు, లంకా హరిశ్చంద్రుడు, ముచ్చు వీరవెంకటసత్యనారాయణ, రేలంగి రాంబాబు, గౌరీశ్వరి, నాగేశ్వరరావు, వాసు, అరుణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

వీఆర్ పురం (ఆంధ్రజ్యోతి): రేఖపల్లి కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ ముత్యాల రామారావు, పెందుర్తి సుదర్శన్, ముత్యాల రమేష్, బొర్ర ఆదినారాయణ, ముత్యాల చంద్రశేఖర్, జంగాల మల్లికార్జునరావు, ఆచంటి శ్రీను, వైస్ ఎంపీపీ వడ్డాణపు భాగ్యలక్ష్మి, గొంది చంద్రయ్య, బొర్ర నరసింహరావు, బురక కన్నారావు, పాయం రామారావు, మామిడి రాజు, పొడియం రాజు, జనసేన మండల అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ, బాగుల అంజన్‌రావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అడ్డతీగల (ఆంధ్రజ్యోతి): స్థానిక దేవీ సెంటర్లో ప్రజలు, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో గిరిజన మహిళా నాయకులు కేక్ కట్ చేశారు. సీనియర్ నాయకుడు బూర్లె హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కూనవరం (ఆంధ్రజ్యోతి): మండలంలో కూటమి నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం నెరవేర్చుకుంటూ వస్తోందన్నారు.టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎటపాక (ఆంధ్రజ్యోతి): నెల్లిపాకలో టీడీపీ సీనియర్ నాయకులు కిలారు వెంకన్న, నలజాల శ్రీకాంత్ చౌదరి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ చేశారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు పుట్టి రమేష్, నాయకులు పాటి చలపతి, ఏలూరి వెంకన్న, బాచినేని శ్రీకాంత్, పాటి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

చింతూరు (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి పాయం వెంకయ్య, మండల శాఖ అధ్యక్షుడు డీవీఎస్ రమణారెడ్డి, జనసేన మండల శాఖ అధ్యక్షుడు మడివిరాజు, కూటమి నాయకులు నూకా చారి, పొదిలి రామారావు, శ్రీరాం, తీగల రవి, కవిత, ఆసిఫ్, నరసింహారావు, సురేష్, కట్ట శంకర్, శీలం తమ్మయ్య, ప్రసంగి, బేడే సతీష్ తదితరులు పాల్గొన్నారు. నిమ్మలగూడెంలో టీడీపీ సీనియర్ నాయకుడు జమాల్‌ఖాన్ కేక్ కట్ చేశారు. రంపచోడవరం పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాస్, నాయకులు ఎండీ జహంగీర్, చంద్రయ్య, తుర్రం ముత్తయ్య, మంగవేణి పాల్గొన్నారు.

మోతుగూడెం (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహానికి ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి: రాఘవరెడ్డి

రంపచోడవరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని రాష్ట్ర టెస్ట్‌బుక్‌ల డైరెక్టర్ వై.రాఘవరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, బ్యాగ్‌లు, టై, బెల్టులను ఆయన పంపిణీ చేశారు. రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని 916 పాఠశాలల్లో 52,550 మంది విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేశారు. డీఈవో వై.మల్లేశ్వరరావు, సర్పంచ్ మంగా బొజ్జయ్య, ఏఎస్‌వో విజయభాస్కర్, ప్రిన్సిపాల్ కె.కృష్ణ, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, పద్మావతి, ఫిజికల్ డైరెక్టర్ భవాని, ఎం.చిన్నిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవీపట్నం (ఆంధ్రజ్యోతి): దేవీపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర కిట్‌లను సర్పంచ్ కుంజం రాజామణి పంపిణీ చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి సన్న బియ్యం ఉపయోగిస్తున్నట్టు ప్రధానోపాధ్యాయుడడు కర్రి నూకరాజు తెలిపారు. కూటమి నాయకులు సిద్ద సత్యనారాయణ, లంక హరిశ్చంద్రుడు, సిద్ద వీరరాఘవేంద్రరావు, ధరమరాజు పాల్గొన్నారు.

వీఆర్‌పురం (ఆంధ్రజ్యోతి): రేఖపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థి మిత్ర కిట్‌లను జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, శ్రీరామగిరి దేవస్థానం చైర్మన్ పెందుర్తి సుదర్శన్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వీర్ల శ్రీనివాస్ పంపిణీ చేశారు. హెచ్‌ఎం కృష్ణమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎటపాక (ఆంధ్రజ్యోతి): నెల్లిపాక జడ్పీ ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను ఎంపీడీవో ఇ.ప్రేమ్‌సాగర్, ఎంఈవో సరియం రాజులు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎటపాక, గౌరిదేవిపేట, తోటపల్లి, చోడవరం, లక్ష్మీపురం గ్రామాల్లోనూ కిట్లను పంపిణీ చేశారు. టీడీపీ అరకు పార్లమెంటరీ కార్యదర్శి మువ్వా శ్రీనివాస్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, కిలారు వెంకన్న, నలజాల శ్రీకాంత్, పుట్టి రమేష్, ఎంపీపీ కాకా కామేశ్వరి, జడ్పీటీసీ ఉబ్బా సుస్మిత, గొమ్ముకొత్తగూడెం ఎంపీటీసీ పాయం దేవీగంగాధర్ పాల్గొన్నారు.

సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం



రంపచోడవరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం పెడతామని రాష్ట్ర టెక్స్‌బుక్‌ల డైరెక్టర్ వై.రాఘవరెడ్డి అన్నారు. గురువారం ఆయన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రంపచోడవరం, చింతూరు డివిజన్లలోని పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకానికి 2,95 ,675 సన్న బియ్యం బస్తాలను సిద్ధం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో డీఈవో వై.మల్లేశ్వరరావు, సర్పంచ్ మంగా బొజ్జయ్య, ఏఎస్‌వో విజయభాస్కర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.కృష్ణ, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, పద్మావతి, ఎం.చిన్నిబాబు, ఫిజికల్ డైరెక్టర్ భవాని పాల్గొన్నారు.

మోతుగూడెం (ఆంధ్రజ్యోతి): డొంకరాయిలో సన్న బియ్యంతో భోజన పథకాన్ని సర్పంచ్ సంధ్యారాణితో కలిసి ఎంపీటీసీ కరకా వెంకటరమణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జయదాస్, వార్డు సభ్యులు సత్యనారాయణ, వెంకట్రావు, సంతోషమణి, అబ్బాయిరెడ్డి, అలుమరెడ్డి, భారత్‌రెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ప్రవీణ్, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్షరాభ్యాసం చేయించిన ఐటీడీఏ పీవో

చింతూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఎర్రంపేట-2 అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ అక్షరాభ్యాసం చేయించారు. అక్కడి సదుపాయాలను పరిశీలించి ఫ్యాన్ పని చేయట్లేదని గుర్తించారు. తక్షణం ఫ్యాన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సీడీపీవో పి.విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



సత్యదేవుడి తొలిపావంచా వద్ద టెంకాయికొట్టి ర్యాలీ ముగిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ



తుని కూటమి కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచుతున్న అశోక్‌బాబు

కూటమి ఏడాది పాలనపై విజయోత్సవాలు

- పెదశంకర్లపూడి టీడీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే నివాళులు
- అన్నవరం వరకు 150 కార్లతో ర్యాలీ
- ప్రతి గ్రామంలోను ప్రజల బ్రహ్మరథం

ప్రత్తిపాడు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గంలో గురువారం కూటమి ప్రభుత్వ ఏడాది పాలన విజయోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ స్వగ్రామంలోని తన భర్త దివంగత టీడీపీ నేత వరుపుల రాజా చిత్రపటానికి నివాళులర్పించి ఏడాది పాలన విజయోత్సవ యాత్ర నిర్వహించారు. పెదశంకర్లపూడి నుంచి 150 కార్లతో సాగిన విజయోత్సవ ర్యాలీ లంపకలోవ, ఉత్తరకంచి, ఒమ్మంగి, శరభవరం, గజ్జనపూడి, చింతలూరు, యుజేపురం, కొంతంగి కొత్తూరు, నెల్లిపూడి, కత్తిపూడిల మీదుగా అన్నవరం సత్యదేవుని కొండ దిగువున తొలి పావనశాల మండపం వరకు కొనసాగింది. ప్రతి గ్రామంలో ఎమ్మెల్యే సత్యప్రభకు సర్పంచ్‌లు, టీడీపీ నాయకులు సన్మానించి హారతులు ఇచ్చి బ్రహ్మరథం పట్టారు. మహిళలు సైతం గ్రామాల్లో ఎమ్మెల్యే సత్యప్రభ కు నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం ఆనందంగా ఉందన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గం పట్ల ప్రత్యేకమైన ప్రణాళికలతో రూ.40కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశామని మరో రూ.10కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించామని తెలిపారు. రాబోయే కాలంలో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుచేస్తూ నియోజకవర్గాన్ని నియోజకవర్గంలో అగ్రగామి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ఎన్ రాజు(మీసాల రాజు), జిల్లా నాయకుడు పర్వత సురేష్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్నా శివ, కూటమి నాయకులు మేడిశెట్టి బాబి, యాళ్ళ జగదీష్, మంతిన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలో ప్రగతివైపు అడుగులు

శంఖవరం: అధికారం చేపట్టిన ఏడాదిలో ప్రతీ అడుగూ అభివృద్ధి వైపే వేసామని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం నిర్వహించిన విజయోత్సవ ర్యాలీ నెల్లిపూడి మీదుగా వెళ్ళింది. మార్కెట్ యార్డు చైర్మన్ బద్ది మణిరామారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సత్యప్రభను సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నేత పర్వత సురేష్, బద్ది రామారావు, బద్ది రమణ, వెన్నా శివ, కీర్తి వెంకటసుభాష్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఏడాది సంబరం

జగ్గంపేట: కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అవడంతో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గురువారం జగ్గంపేట నియోజకవర్గంలోని కిర్లంపూడి మండలం సింహాద్రిపురం నుంచి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో 200 కార్లలో విజయోత్సవ ర్యాలీ జాతీయ రహదారి మీదుగా రామవరంలో సాగింది. సీసీ రోడ్డు ప్రారంభించారు. జగ్గంపేట నాలుగురోడ్ల జంక్షన్‌లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు నెహ్రూకు స్వాగతం పలికారు. అనంతరం సంత మార్కెట్లో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఉచిత కుళాయి ద్వారా తాగునీరుకి ఇబ్బందులు లేకుండా చేయడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వానికి పెద్దపీట వేసిన ఓటర్లకు రుణపడి ఉంటానన్నారు. ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, మణిబాబు, దేవరపల్లి మూర్తి, కొత్త కొండబాబు, పాండురంగ రాంబాబుతో పాటు నాలుగు మండలాల కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

కూటమి కార్యాలయంలో శ్రేణుల సంబరాలు

తుని రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అవడంతో తుని కార్యాలయంలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్ ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా రాజా అశోక్ బాబు మాట్లాడుతూ తునిలో ఈ ఏడాది ప్రజా ఆమోదమైనపాలన సాగిందని, ఇదే స్ఫూర్తితో ఎమ్మెల్యే యనమల దివ్య ముందుకు సాగాలని ఆకాంక్షించారు. యనమల రాజేష్ మాట్లాడుతూ ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుర్ల లోవరాజు, యినిగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్, తుని మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, టీడీపీ పట్టణ అధ్యక్షురాలు కుసుమంచి శోభారాణి ఉన్నారు.

విజయోత్సవ ర్యాలీ

అన్నవరం: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే చేపట్టిన విజయోత్సవ ర్యాలీ గురువారం సత్యదేవుడి తొలిపావంచా వద్ద ముగిసింది. స్వామివారికి ఆమె టెంకాయికొట్టి పూజలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పర్వత సురేష్, వెన్నా శివ, కీర్తి వెంకటసుభాష్, బద్ది రామారావు, స్థానిక నాయకులు రాజాల చిట్టిబాబు, పలివెల సతీష్, మద్దు వీరబాబు, పసుపులేటి చక్రి తదితరులు పాల్గొన్నారు.

తారు, సీసీ రోడ్లు ప్రారంభం

కిర్లంపూడి: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలనకు విజయోత్సవ ర్యాలీ గురువారం నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో సింహాద్రిపురం గ్రామం నుంచి సుమారు 200 కారులు, బైక్‌లతో జగపతినగరం, కిర్లంపూడి, చిల్లంగి, గెద్దనాపల్లి, భూపాలపట్నం, ఎస్.తిమ్మాపురం, తామరాడ, గోనేడ మీదుగా ర్యాలీగా జగ్గంపేట వెళ్లారు. ముందుగా సింహాద్రిపురం తారురోడ్డును ఎమ్మెల్యే నెహ్రూ, నవీన్ ప్రారంభించారు. వీరవరం నుంచి భూపాలపట్నం వెళ్లే రహదారికి శంఖుస్థాపన చేశారు. ఎస్.తిమ్మాపురం, తామరాడ గ్రామాల్లో సీసీ రోడ్లు ప్రారంభించారు. రూ.1.75 కోట్లతో ప్రారంభోత్సవాలు చేశామని ఎమ్మెల్యే నెహ్రూ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకున్న పాఠశాలలు

ప్రత్తిపాడు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలంలో 50 ప్రభుత్వ పాఠశాలలు గురువారం తెరుచుకున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభ రోజైనా విద్యార్థుల హాజరు ఆశాజనకంగానే ఉంది. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కూడా మొదటి రోజున అమలు చేశారు. చింతలూరు, శరభవరం, గజ్జనపూడి పాఠశాలలను ఎంఈవో వి.రాజబాబు, సీఆర్పీ రాంజీప్రసాద్‌లు, పెద్దిపాలెం, ఉత్తరకంచి, గోకవరం పాఠశాలలను ఎంఈవో2 వై.అచ్చురాజు, సీఆర్పీ భాషల బృందాలు పరిశీలించాయి. ఈ సందర్భంగా ఎంఈవోలు రాజబాబు, అచ్చురాజులు మాట్లాడుతూ మండలంలో నూతనంగా పెద్దిపాలెంలో హైస్కూలకు చెందిన 9, 10 తరగతులు ప్రారంభమయ్యాయని, కొండపల్లి, ఉలిగోగుల, కె.అచ్చంపేటలో జీపీఎస్‌లు ప్రారంభించామని తెలిపారు.

తొలిరోజు హాజరుకాని విద్యార్థులు

గండేపల్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగియడంతో గురువారం పాఠశాలలు తెరుచుకున్నాయి. తొలిరోజు విద్యార్థులు పూర్తిస్థాయిలో హాజరుకాలేదు. మండలంలో సుమారు 41 ప్రభుత్వ పాఠశాలలు ఉంటే వాటిలో 2818 విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది. మొదటి రోజు 893 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. ఎంఈవో నాయక్ మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు పిల్లలను స్కూల్‌కు పంపించాలని ఫోన్‌లో మాట్లాడారని విద్యార్థులు పాఠశాలలకు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లా సరిహద్దులో అక్రమ తవ్వకాలు

- లారీలను అడ్డగించిన కవలపాడు గ్రామస్తులు

తుని రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి, కాకినాడ జిల్లాల సరిహద్దు పాయకరావుపేట మండల గ్రామంలో నర్సాపురం సాగునీటి చెరువుల్లో మట్టినితవ్వి తుని నియోజకవర్గం కవలపాడు వద్ద ఇటుకబట్టీలకు తరలిస్తుండటంపై ఆయా గ్రామస్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా కవలపాడు గ్రామస్తులు మట్టిని తరలిస్తున్న వాహనాలను అడ్డగించి తుని రూరల్ పోలీసులకు సమాచారం అందివ్వడంతో రూరల్ పోలీసులు వాహనాలను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనాలు అదుపులోకి తీసుకున్న వ్యవహారంపై పోలీసులను ఆరా తీయగా వాహనదారుల యజమానులకు సమాచారం అందించామని వారితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

సీసీ రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యే నెహ్రూను సత్కరిస్తున్న జడ్.రాగంపేట, నాయకంపల్లి గ్రామాల రైతులు, గ్రామస్తులు

గండేపల్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలో నీలాద్రిరావుపేట గ్రామంలో నిర్మాణం చేసిన సీసీ రోడ్లను, తాళ్ళూరు నుంచి ఉప్పలపాడుకు నిర్మించిన బీటీ రోడ్డును గురువారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పోతుల మోహనరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కోర్పు సాయితేజ్, యువకులు జాస్తి వసంత్, కురుకూరి చౌదరి, మారిశెట్టి భద్రం, రమేష్ తదితరులు ఉన్నారు.

కండికాలువ బ్రిడ్జికి నిధుల మంజూరుపై హర్షం

జడ్.రాగంపేటలో కండికాలువపై బ్రిడ్జి నిర్మాణం చేయడంవల్ల ఐదు గ్రామాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని జడ్.రాగంపేట సర్పంచ్ కందుల చిట్టిబాబు అన్నారు. జడ్.రాగంపేట నుంచి నాయకంపల్లి వెళ్లే దారిలో ఉన్న కాలువపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.30కోట్లు మంజూరు చేయించిన జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను గురువారం సర్పంచ్, గ్రామస్తులు సన్మానించారు. చిట్టిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కందుల బాబ్జి, ఉండవల్లి ప్రసాద్, యేసయ్య, శ్రీను, నారాయుడు, సుబ్బారావు పాల్గొన్నారు.

వాహనదారులు భద్రతా నియమాలు పాటించకుంటే చర్యలు

రౌతులపూడి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): భద్రతా నియమాలు పాటించకుండా, అధిక బరువుతో టిప్పర్‌లు నడిపితే చర్యలుతప్పవని కత్తిపూడి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వాహనదారులను హెచ్చరించారు. కొన్నిరోజులుగా భద్రత నియమాలు పాటించ కుండా, అధికబరువుతో తిరుగుతూ రౌతులపూడి, శంఖవరంమండల ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తున్న టిప్పర్‌లను జిల్లా అధికారులు ఆదేశాల తనిఖీచేశారు. నిబంధనలు పాటించని 14టిప్పర్‌లపై కేసులు నమోదుచేసి జరిమానా విధించినట్టు శ్రీనివాస్ తెలిపారు.

రోడ్ మెటల్ మైనింగ్ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ

రౌతులపూడి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఎస్.పైడిపాల గ్రామంలో గురువారం రోడ్‌మెటల్ మైనింగ్ ప్రాజెక్టుపై అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. సర్వేనెంబర్ 15లో 3.836 హెక్టారల్‌లో తూర్పుగోదావరి జిల్లా వడ్లకుంట గ్రామానికి చెందిన గారపాటి రామకృష్ణ అనే వ్యక్తి మైనింగ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. దీనిపై సంబంధిత స్థలం వద్ద ఆర్డీవో, శ్రీరమణి, పర్యావరణ ఈఈ శంకరరావు పర్యావరణ అనుమతులుపై ప్రజాభిప్రాయ సేకరణ చేసారు. ప్రజలు నుంచి ఎన్జీవోలును అభిప్రాయాలు తీసుకున్నారు. ఓపౌండేషన్ ఎన్జీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు లేకుండా ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్వీ నరేష్, ఎన్జీవోలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిస్తే అవార్డు ఇచ్చారు

- వైకల్యంవల్ల పింఛన్‌కు అర్జీ పెట్టుకుంటే తిరస్కరించారు
- అధికారుల ఉదాసీనతపై తల్లిదండ్రుల అసంతృప్తి



తల్లిదండ్రులతో హెప్సిబా

గండేపల్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జడ్.రాగంపేట గ్రామానికి చెందిన డి.వీరబాబు, సుబ్బలక్ష్మి కుమార్తె డి.హెప్సిబా పదవతరగతి పరీక్షల్లో 529 మార్కులు సాధించి జిల్లా కలెక్టర్, మంత్రి, ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రతిభా అవార్డు అందుకుంది. అయితే ఆ విద్యార్థినికి చిన్నప్పుడు ఆడుకుంటుండగా ఎడమ కంటిలో పెన్ను గుచ్చుకోవడంతో ఆపరేషన్ చేయించారు. కొంతకాలం తర్వాత గాయమైన కంటిగుడ్డు పూర్తిగా తొలగించాలని లేదంటే రెండవ కన్నుకు ప్రమాదమని వైద్యులు తెలపడంతో హైదరాబాద్‌లో దాన్ని తొలగించి గాజు కన్ను పెట్టారు. ప్రతీ ఆరు నెలలకు విశాఖపట్నం, హైదరాబాద్ వెళ్లి క్లీనింగ్ చేయించాలని డాక్టర్లు చెప్పారని ఇది ఖర్చుతో కూడిన వైద్యమని తల్లిదండ్రులు వాపోతున్నారు. రోజు వారీ కూలీ పని చేసుకునే వీరబాబు తన కుమార్తెకు వైద్యం చేయించడానికి అవస్థలు పడుతున్నారు. దీనిపై కొన్నేళ్లుగా నాయకులను, అధికారులు కలిసి హెప్సిబాకు పింఛన్ ఇప్పించాలని మొరపెట్టుకున్న పట్టించుకున్న నాధుడే లేడు. అధికారులు చుట్టూ తిరిగినా ఫలితం లేదని వాపోతున్నారు. విద్యలో రాణిస్తున్న హెప్సిబాకు కూటమి ప్రభుత్వం అయినా పింఛన్ ఇప్పించి ఆదుకోవాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి

తొండంగి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ ట్రేడ్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకోటి రాజు డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఒంటిమామిడి గ్రామంలో ఉపాధి హామీ కూలీల తో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. రెండు నెలలుగా ప్రభుత్వం ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన వేతన బకాయిలు చెల్లించాలన్నారు. పనిచేసే ప్రాంతంలో టెంట్లు ఏర్పాటు చేసి మంచినీటి సదుపాయం కల్పించాలన్నారు. కూలీకు అవసరమైన పారలు , గునపాలు, తట్టలు ప్రభుత్వమే సమకూర్చాలన్నారు.

జాతీయ రహదారిపై రేడియం స్టిక్కర్లు ఏర్పాటు

జగ్గంపేట రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట నేషనల్ హైవేపై ప్రమాదాల నివారణకు రేడియం స్టిక్కర్లను జగ్గంపేట పోలీసులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జాతీయ రహదారి ఇరువైపులా టైర్లను ఉంచి వాటిపై రేడియం స్టిక్కర్లను అతికించామని అన్నారు. ప్రమాదాల నివారణకు సిబ్బంది అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జగ్గంపేట ఎస్సై రఘునాథరావు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జగ్గంపేట ఎమ్మెల్యే నెహ్రూ

వాస్తవాలు తెలుసుకుని

మాట్లాడు అంబటి

- తప్పుడు ప్రచారాలు చేస్తే చూస్తూ ఊరుకోం
- అర్హులందరికీ సూపర్ సిక్స్ పథకాలు
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే నెహ్రూ

గండేపల్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టిస్తుంటే ప్రతిపక్ష అధినేత, మాజీ మంత్రులు తప్పుడు ప్రచారాలు చేస్తూ రోడ్డెక్కుతున్నారని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం జడ్.రాగంపేట శివారున పరిణయ ఫంక్షన్ హాల్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. పథకాలు పూర్తిస్థాయిలో అనౌన్స్ చేయకుండానే ప్రజలకు అందించడంలేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని సంవత్సర కాలంలోనే కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. తల్లికి వందనం పథకంలో పూర్తిస్థాయిలో తల్లులకు అందలేదని మాజీ మంత్రి అంబటి రాంబాబు వాస్తవాలు తెలియకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. తప్పుడు లెక్కలు వేసి ప్రజలను మోసం చేయడానికి చూస్తే చూస్తూ ఊరుకోమన్నారు. తప్పుడు ప్రచారాలు చేసి రోడ్లెక్కితే ప్రజలు నమ్మే పరిస్థితి లేదని రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో కందుల చిట్టిబాబు, యర్రబాబు, సుంకవిల్లి రాజు, పాలచర్ల నాగేంద్రచౌదరి తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

గండేపల్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గండేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గండేపల్లి, సింగరంపాలెం, రామయ్యమ్మపాలెం గ్రామాలకు శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం వరకు సాయంత్రం 3 గంటల నుంచి 6 వరకు కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ డి.వీరభద్రరావు, ఏఈ కిరణ్‌కిషోర్ తెలిపారు. బొర్రంపాలెం 33/11కెవి సబ్‌స్టేషన్ వద్ద మరమ్మతుల కారణంగా బొర్రంపాలెం, తాళ్లూరు, మల్లేపల్లి, సుబ్బయ్యమ్మపేట గ్రామాలకు ఉదయం 8గంటల నుంచి 1గంట వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త ప్రసాద్

ఏలేశ్వరం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎల్.కె.ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని సిరిపురం గ్రామంలో వ్యవసాయ అధికారిణి జ్యోతి నేతృత్వంలో రైతులకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. రైతులు వరిలో సన్న రకాలను వేసుకోవడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చన్నారు. పంట అనంతరం నేల ఖాళీగా ఉంచకుండా పచ్చిరొట్ట పెంచడం ద్వారా భూసారం పెరిగి నాణ్యమైన దిగుబడి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో బి.నాగేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోటనందూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కెఇ చిన్నయ్యపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్‌కు శుక్రవారం అంతరాయం కలుగుతుందని ఏఈ వీరభద్రరావు తెలిపారు. మండలంలోని తిమ్మరాజుపేట, కెఎస్ కొత్తూరు, పి.కొట్టాం, కె.కొట్టాం, ఎల్‌డిపేట గ్రామాల్లో మరమ్మతులు చేయడంతో పాటు కొత్తలైన్ వేస్తున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో శుక్రవారం 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు జగ్గంపేట విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.వీరభద్రరావు తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని లైన్ వెంబడి చెట్టు కొమ్మలు, లైన్ మరమ్మతు నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రత్తిపాడు, టి.రాయవరం, ధర్మవరం, రాచపల్లి, ఒమ్మంగిల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

జగ్గంపేట: ఉదయం 8నుంచి మధ్యాహ్నం వరకు కాకినాడ రోడ్డు, పద్మనాభనగర్, శెట్టిబలిజవీధి, పల్లపు వీధి, సత్యవేణిపేట, మెయిన్ రోడ్డులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ తెలిపారు.